సత్యం. ఇందిర తెల్లబోయింది. "ఎవరు రమణ?" సెమీసూట్ లో వున్న ఆ సన్నటి పెద్దమనిషా?"

"మల్లెపు వ్వొచ్చిందండి - రాత్రి మనం చూశాంగా, బాగానే రాశాను. అన్నట్టు రాత్రి నా జేబు రుమాలేదైనా ఇక్కడ మరిచి పోయానా?"

ఈ మాటలు పూర్తిగా అనకముందే ఇందిర లోపల్లోపల నవ్వుకుంటూ తలుపు సందులోంచి జేబు రుమారు ఇవతల పడేసింది.

ఇందిర చేసిన ఆ పని సత్యానికి వొళ్లు మరిపించింది. రమణతో మాట్లాడుతున్నాడన్న మాటేగానీ దృష్టంతా ఇందిరమీదే వుంది.

కోపంగా కొడుకు ఇందిర జుట్టు పీకుతుంటే "అబ్బ-వొదులు" అని వొదిలించుకుంది ఇందిర వాడితో కష్టంతో పోట్లాడి.

"అబ్బ! గిల్లుతావేం?"...చెయ్యి వెనక్కి తీసిపెట్టింది ఇందిర.

కుర్రాడు ఏడవ పోతుంటే—

"కోపమొచ్చిందా?"...అని ఇందిర వాణ్ణి గట్టిగా ముద్దు పెట్టుకుంది—

"ఇటో..."అని రెండో వైపుకూడా ముద్దు పెట్టుకున్న తర్వాత "ఈ సారి కొరికావంటేనా...!" నవ్వుతూ అంది ఇందిర.

సత్యం గుక్క తిప్పుకోలేక పోయాడు. గబ, గబా పరుగెత్తుకు వెళ్లి నుంచున్న ఇందిరను అమాంతంగా కౌగిట్లోకి తీసుకున్నాడు.

స్కెచ్

# పిల్లలు — పెద్దలు

"రమణశ్రీ"

నేను పిల్లల్ని పాడుచేస్తున్నానని మా శ్రీదేవి ఒకటే గొడవ రోజూ. ఆడతుమ్మెద లాగ చెవుల్లో గింగుర్లెత్తించేది. నిజంగా నాదే తప్పయితే, మా శ్రీదేవి యిచ్చే ప్రేమపూర్వకమైన శిక్షలకు అర్హుణ్ణే. ఆ శిక్షార్హత నాకు లేదేమో బుజువు చేసుకుంటా.

* * *

స్కూలు కుర్రాళ్ల గోలలోంచి తప్పించుకొని ఇంటిముఖం పట్టేసరికి చెమటలు పట్టి తల ప్రాణం తోకకొస్తుంది.

"ట్రెయినింగ్ లో చదివిచచ్చిన బాల బాలికా మన స్తత్వ సూత్రాలు ముమ్మూర్తులా అమలు జరపుదామని ఎంత ఏడిస్తే గొర్రెల మంద ఊరుకుంటేనా! ఒకొక్క గొర్రె కొండను ఢీకొనేటంత పనిచేసేది. ఒక్క వెధవని కొట్టకుండా నెట్టుకొద్దామనుకుంటే మన నెత్తిమీద రాళ్లు విసురుతున్నారు. వత్తి మేకల మందంటే నమ్మండి. (అందులో కొందరు మేకల్లా అరిచేవాళ్లు కూడా వున్నారు.)

ఇంటికి రాగానే మా శ్రీదేవి వంటిమీద చేయివేసేసరికి, విసుగునసుగుపోయేది. అమ్మయ్యా అని కుర్చీమీద కాలు వేయబోయేసరికి, కాల భటులు ప్రత్యక్షం! ఒకడు జుట్టుపీక, మరొకడు వాడికి సహాయంగా- మా పూర్వాసవాసనా ఫలితం-ఓ పెద్ద పిడినిలాగ, వీళ్ళిద్దరినీ రక్షించు కొనేసరికి మా బాపనయ్య- ఆరేళ్లు ఇంకా రాలేదు లెండి- తొడ సింహాసనం ఎక్కేసేవాడు.

ఆ సింహాసనం మీదనుంచి పడగొడదామని మా రెండోవాడి ప్రయత్నం ధ్రువుడికి మల్లే. వాడుగూడా సరాసరి ఆ సింహాసనం దురాక్రమణ చేసేయడానికి ఉపక్రమించాడు. మా రెండోవాడు ధ్రువుడికంటె రెండాకు లెక్కువే చదివాడు లెండి!

తపుక్కున ఉత్తముడిలాంటి మా చిన్న కొడుకు బాపనయ్యగాణ్ణి లాగిపారేసి, అచోటు దురాక్రమణచేశాడు. అబ్బబ్బ! ఎక్కిన వెధవ తిన్నగావున్నాడా! సిసింద్రీ వెధవ! తొడమీద కాళ్ళమీద వెంద్రుకల్ని సాగలాగి, అవి బొడి పెలు కడుతూంటే "మాణ్ణాన్నా! భలే!

ఛతే!" అని ఎగిరేసేవాడు. "ఛీ! వెధవా! దిగరా మొద్దూ!" అన్నా వూరుకోడు. "పైగా నాకన్ని వెంట్రుకల్లేవేం నాన్నా" అని ఎదురు ప్రశ్న.

ఈ తరహాగా ఉత్తానపాదుడి తొడమీద మారో్చిపోయిన ధ్రువుడో ఉత్తముడో ఇలా చేశాడో లేదో గాని, మావాడు నా పని పట్టిస్తున్నాడు.

ఇంతలో సురుచిలాంటి శ్రీదేవి రుసరుసలాడుతూ, బుసలు గొడుతూ వచ్చి, వాణ్ణి కిందికి దించి, "ఆరి వెధవ గాడిదకొడకా! తొడమీదెక్కి, తందనాలు తొక్కుతున్నావురా బడికెళ్లకుండానూ?"

ఇదే సమయమని మా బాపనయ్యగాడి రిపోర్టు. "అమ్మా అమ్మా! చిన్నన్న యేం, మరేం, లాగేసేడే! ఆడు కూర్చున్నాడే"

ఏడుపు మొగంతో గోలెత్తిపోతోవుంటే, ఆ యిల్లాలు చూడలేక ధ్రువుడిలాంటి మా రెండోవాణ్ణి బరబర ఈడ్చి, పాపం శమించుగాక! అవతలికి విసిరేసింది.

ఇంతకూ నాకు మరో సునీతి లేకపోవటంతో అంతలా జరిగిపోయింది గాని...

నేను చూస్తూ బొమ్మలాగ, కొదుకాదు ఉత్తానపాదుడి లాగుండిపోయానంటే, నాతప్పు గాదు, మా ఆవిడ రాణి తనం!

మా యింటికి ప్రక్కన ఒక మంచాయన ఉన్నాడు లెండి. ఆయన్ని గురించి, మీకీ ఘట్టంలో పరిచయం చేస్తాను.

ఆ రోజున విసుగు, చిరాకు, పరాకు కూడ గట్టుకొని ఒక్కసారి నన్ను ముట్టడించాయంటే నమ్మండి.

ఆ వేళ శ్రీదేవిని కూడా చెయ్యి చేసుకోవలసి వచ్చిందని చెప్పడానికి సిగ్గుపడుతున్నా.

స్కూలు తనిఖీకి ఇన్స్పెక్టరు వచ్చాడు.తలనొప్పని ఇంటి దగ్గర పడుకొన్నా. బంట్రోతు గాడు వచ్చి కొందేటి చాంతాడల్లేశాడు. హెడ్మాష్టరు బ్రతిమిలాడాట్ట పాపం! నాకు జాలివేసి, త్రోసిరాజనలేక పోయ్యాను.

రాగాపోగా మా క్లాసుకే వచ్చాడు ఇన్స్పెక్టరు. నా తద్దినం అయిపోతుందని గజగజ వణికి పోయాను. క్లాసుకి హాజరు పడిపోను మండే. అసలు ఇరవైయేడు. ఇనస్పెక్టరు ఉరిమి ఉరిమి చూచాడు. "అంతేలెండి!" అన్నాను మనసులో.

బుస గొట్టాడు అధికారి. కసబిస రాసేడేదో. నాముఖం చూడగానే వాడికేం ముచ్చటైన బుద్ధి పుట్టిందో గాని, తగ్గించారు. దీనికి వేరే తెం వెనక భాగవతం ఉంది లెండి. అదఅవసరం.

దీనితో వాడిమీది కోపం, వెధవ పనిమీద కోపం తాపం రాపాడి రాపాడి శ్రీదేవి మీద పడ్డాను.

అప్పుడు మా రెండోవాణ్ణి గదిలో పెట్టి చావగొడుతోంది.ఏదో పారేశాట్ట. "మీనాన్న మూలాన్నే ఇంత చెడ్డావురా. బాగా అలుసిచ్చి నెత్తి కెక్కించుకున్నాడ్రా."

నేను నరసింహం లాగెగిరిపడ్డాను."కుర్రాణ్ణి చావగొడతావా! కూలి ముండా?"

"కూలి ముండా" అన్న పదం యతికోసం అప్రయత్నంగావచ్చి, నా కొంప ముంచిందంటే నమ్మండి.

త్రాచులాగ బిగబట్టింది. ముట్టుకోబోతే బుస గొట్టేది.

"కొట్టండి. తిట్టండి. మావాళ్లు మీకు నన్ను కొట్టుకోడానికే యిచ్చారు. చచ్చారు. మీచేతి కింది దాన్నే. తన్నండి. కొట్టకేంచేస్తారు. తేరగాదొరికాం, కూలిముండలం మీ యిష్టం."

ఈరీతిగా పొడిపొడి మాటలు, తడితడిగా, తడబడుతూ గడగడ శపించ సాగించింది. మా రెండో వెధవ ఆరున్నొక్క రాగం పైస్థాయిలో వుంచాడు.

"నీ మూలాన్నే వచ్చిందిరా" అని పెడపెడబాదేశాను చేతికండూలి తీరేదాకా.

ప్రక్కింటాయన వచ్చి ఆపేవరకు నా వళ్ళు నాకు తెలీనేలేదు.

"ఏమిటయ్యా! మనిషివా! పశువ్వా! కుర్రాణ్ణి కొడతావ్? ఎలా పొగలు గక్కుతున్నాడో చూడు పిచ్చినాయన."

"రా నాయనా! రా నేనెత్తుకుంటా."

ఆయనెత్తుకున్నాడు, నాకు మతిపోయింది.

నేను వెర్రిగా కేకవేశాను. "చచ్చు గాడిద కొడకా! దిగు, దిగు. వీణ్ణివ్వాళ నరికేస్తాను. ఏబ్రాసిగాడిదా దిగు– దింపండి."

ఇంకా కోపం నటిస్తూనేవున్నా. ఆయన నానోరు నొక్కాడు. చచ్చినంత సిగ్గువేసింది. నావైపు తీవ్రంగా చూచి, తీసుకుపోయాడు.

"ఇల్లాగైతే ఎల్లాగరా నాయనా! ఈ సంసారమంతా నీపాలినరకమై పోతోందిరా బాబు" మా అమ్మ రోజల్లా ఒకటే గొడవ.

ఎవరూ ఒక మెతుకన్నా గతకలేదు. ఆ రోజు నాకు బతుకే లేదన్నమాట. ఒకరికన్న ఒకరికి బింకం. టంకం వేసుకుపోయి కదల్లేదు. ప్రక్కింటాయన కుర్రాణ్ణి తీసుకవచ్చి, మా ఆవిణ్ణి నన్ను ఓదార్చి, పోకార్చి, ఒక తీరులోకి తీసుకొచ్చాడు. ఇద్దరం రాజీకి కుదిరేం ఎలాగో.

ప్రక్కింటాయన చేసిన ఉపకారం మరవ రాని ఘట్టం. ఆయనకు కృతజ్ఞతగా నాకు మరోబిడ్డ పుట్టే ఆశవుంటే ఆయన పేరు, లింగానుగుణంగా మార్చిపెట్టుకో వచ్చునని తాత్కాలికంగా నిశ్చయించుకున్నా.

ఆరోజలా తెల్లవారిపోతే మహబాగున్నది. మర్నాటినుంచి మా గొడవ మాకు తప్పలేదు.

మా ప్రక్కింటాయన రోజూ రావటం, కుర్రాళ్ళకు పంచదార బిళ్ళలు, పళ్లూ, అవీ యివీ పెట్టి మచ్చిక చేసుకునేవాడు వాళ్ళతో వాళ్ళ భాషలో మాట్లాడి ఆనందించే వాడు. సరిసమానంగా ఆడేవాడట కూడానూ. అదేం సరదావో గాని!

మా శ్రీదేవి దానికి బాగా దెప్పిపొడిచేది. "ఆయన మాత్రం తెలివితేటలు కూడా బండి సున్నే మీకు! ఎంత బాగా ఆడిస్తున్నారో పిల్లల్ని. ఏ ఆడదాడించ గలదండీ? ఎంత గుక్క పట్టి ఏడ్చేవాడైనా పిల్లిలాగైపోతాడాయన దగ్గర. ఆయనకెంత సరదావో!"

నాకు సరదా లేదని గాదూ? ఇంతకూ నాకు బాదడం తప్ప ఏంరాదనేది. నేనేం జేయను? నాతప్పా మరి?

ఒకనాడు మా రెండోవాడు పరుగెత్తుకుంటూ నావళ్ళో వచ్చి పడ్డాడు. "ఛీ" అని విదిలించేశా.

మా శ్రీదేవి అందుకుని "అదే వచ్చింది మరి! వాడెంతో సంతోషంతో ఏదో చెప్పుదామని ఉరకలేసుకుంటూ వస్తే విసిరి కొట్టుకుంటారేం"

అని పెదవులు బిగించి కోరగా చూచింది. మా వాడు చెప్పుకుపోతున్నాడు.

"నేనూ, మన పక్కింటాయనా గోళీకాయ్ లాడేం—నాన్నా! దెబ్బకొక్కసీ, అయనే వోడిపోయేవోడేవ్. పావలా వొచ్చిందేవ్. అమ్మా సినిమా కెళ్తానే. అంతదూరంలో ఉండగానే కొట్టేసీవాణ్ణి. ఆయన కాయదగ్గరున్నా ఉక్కిసేది. ఆయన కొడ్డం చేతరాదు నాన్నా, రోజూ ఆడదాం రమ్మంటున్నాడు నాన్నా. వెల్తానే నాకు చాలా చాలా."

"అపు వెధవా!" అన్నా గట్టిగా.

"ఎక్కడరా ఆడత" అంది శ్రీదేవి.

"వాళ్ళ దొడ్లోనే. రెండు కంచాలు తీశాడాయనే. ఎవరన్నా చూస్తే బాగోదన్నాడేవ్."

శ్రీదేవి ముఖం వికసించి నవ్వు విరిసింది.

ఆఫీసులో బంట్రోతు ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకున్న పదహారేళ్ళ కుర్రాడిని పరీక్షిస్తున్నాడు మేనేజరు.

"నీపేరు?" కుర్రాడి సమాధానం: "పోతన్న అంటారండి."

"ఇంటిపేరు?" వివరంగా అడిగాడు మేనేజరు.

"బమ్మెరవారండి."

"ఎక్కడో విన్న పేరులాగుందే?"

"వినే ఉంటారండి. నాలుగేళ్ళనుండి నేను యీ వీధిలోనే నౌఖరీ చేస్తున్నాను." అన్నాడు కుర్రాడు.